# రంగస్థల సేనాధిపతి

**- పన్నాల సుబ్రహ్మణ్యభట్టు**

మహానది ప్రవహిస్తూంటే చూస్తూ ఆశ్చర్యపడటం తప్ప ఏమీ చేయలేం. అలాగే ఆచార్య మొదలి నాగభూషణశర్మ ప్రదర్శనరంగస్థలి ప్రయాణవిశేషయాత్రకూడా విజ్ఞులను సహితం అబ్బురపరుస్తుంది. ఆ నదిలాగే సాధారణ మూలాలతో ఆరంభమయి పారుతున్నకొద్దీ విశాలమై వేగం పెంచుకొని అన్ని సంస్కారాలను భిన్న సంస్కృతులను తాకుతూ పలుకరిస్తూ ఆగి తానే పరవశించి, చూసేవారికి ఒక తన్మయభావం సాక్షాత్కరింపచేసి సాగిపోతున్న నది ఆయన. యోగిలాటి తాపసి, తపస్సిద్ధికోసం పుట్టిన యోగి. నిరంతరకర్మాచరణ ఆయనకి పట్టిన అదృష్టం. అనితరసాధ్యమయిన అవగాహన పటిమ ఆయన కవచం. సంప్రదాయాన్ని ఆధునికతనీ ఈదగల బాహుబలం ఆయనది. మూలాలనీ, మూలాలు సాధించిన మూల్యాలనీ, ఇప్పుడు చెల్లించవలసిన మూల్యాలనీ - నాటకరంగంలో - ఎంత దూరదృష్టితో సాధించవలసి ఉన్నదో - ఆయన తన 20వ ఏటనే అర్థం చేసుకొనగలిగారు. ఆంగ్లంలో మేలురకం ఉపన్యాసకవర్గంలో స్థిరపడినా అమెరికా వెళ్ళి దర్శకత్వంలో విద్యనభ్యసించారు.

అమెరికన్ రంగస్థలంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేటుపట్టా పొందారు. తర్వాత ఆయన చూపిన ప్రభావం-చేసిన పని ఆయనకు ముందుగల ఏ రంగస్థలకోవిదులకీ సాధ్యం కాలేదు. సమకాలీన భారతీయ రంగస్థలంలో వస్తున్న మార్పులనీ, మన కూచిపూడినృత్యాల మేలుబంతినీ, భారతీయనృత్యరీతుల ప్రదర్శనలమాలనీ తరచి తరచి చూశారు. తెలుగు నాటకరంగ, నాటకవిమర్శ పరిమితుల్నీ, పూర్వ, ఆధునిక తేజాల్నీ, ఉత్తేజాలనీ ఔపోసనపట్టి కొత్త రుక్కులవంటి గ్రంథాల్ని వెలయించారు. రఘురామయ్య, బళ్ళారి, స్థానం లాటి నటులగురించి; చిలకమర్తి, రాజమన్నారు, ఆత్రేయ వంటి రచయితలగురించి, సూరిశాస్త్రిగారి వంటి విమర్శకుల గురించి - ఆయన తట్టిచూడనివారు లేరు. తూర్పుభాగవతులు, భాగవతమేళామేలట్టూరులు, తోలుబొమ్మలాటలు, జానపదుల ప్రదర్శన కళారూపాలు - వీటిలో వ్యక్తమైన మార్పుచెందుతున్న విషయనిరూపణ, వైవిధ్యప్రకటన - ఆయన చర్చించని రంగస్థల రూపం లేదు; నిర్మితి లేదు.

ఎందుచేత? ఆధునిక సాంఘికనాటకమంటే సంభాషణలబంతులాట కాదని తెలుగునాట విలసిల్లిన అనేక రూపాల సారాంశాలను, అమృతకలశంలో పోసిన ప్రాణధారలను ఘటనాకల్పనలో, సంవిధానరచనలో, ప్రదర్శనా చాతుర్యంలో ఎంచుకొని, జల్లుకొని నాలుగుకాలలపాటు గర్వంగా నిలబడటమేనని శర్మగారు ఇంతగా పాటుబడ్డారు. కొద్దిమందైనా ప్రజ్ఞగల ఆలోచనాబంధువులతో శ్రమించారు. ఫలితాలను విద్యార్థులద్వారా అందించారు.

ఈ కృషి గొప్పమార్పు తెచ్చినదా అంటే సమాధానం కష్టమే. కాని ఎప్పుడు మన ఔత్సాహిక నాటకరంగంలో ఏ దళనాయకుడు శర్మగారు సిద్ధంచేసిన ఈ ఆయుధాలను పరీక్షిస్తాడో ప్రయోగిస్తాడో, ప్రదర్శనా రణరీతిలో మార్పు తెస్తాడో కాలమే సమాధానం చెప్పాలి.

ప్రయోగమంటే మామూలు మాటకాదని, బుద్ధితోనూ, దర్శకప్రతిభతో ముడిపడి ఉందనీ, అంధాయుగ్ అనువాదం చేసి తెలుగులో ప్రదర్శించారు. సంఘర్షణ అంటే జమీందారీ - రైతువర్గపోరాటం మాత్రమేకాదని,

మానసిక భౌతిక విశ్లేషణలమధ్య అంతర్యుద్ధము కూడా సంఘర్షణ అయి, నాటకవస్తుబలం విశ్వరూపమవుతుందని హయవదన అనువాదం ప్రదర్శించి సూచించారు. లౌకికప్రపంచంలో మేరుసమానధీరులయిన ధీరుడు ప్రజానాయకుడు ఎదుర్కొన్న శరాఘాతాలను ఘటనాశకలాలుగా చూపుతూ జీవితచరిత్రను ఎలా రక్తిమయ దృశ్యకావ్యంగా చూపవచ్చునో ప్రకాశంపంతులుగారి కథను నాటకంగా ప్రదర్శించారు. బ్రెక్ట్ నాటకం వెయిటింగ్ ఫర్ గోడో విద్యార్థులచేత ప్రదర్శించాలని సిద్ధం చేశారు. అఘటనాసార్థక్యానికి ఆ నాటకం ప్రపంచాన్ని కుదిపిన నాటకం అది.

మిమ్మల్ని కుదిపే నాటకం ఎక్కడ్నుంచి వస్తుంది. కూచిపూడి 'జడ'రూపకంలోంచి వస్తుంది. అదొక మెటఫర్. నందయశోదల హృదయాలు ఎక్కడ కలుస్తాయి – విప్పారిన నాట్య – సంవాద ముగింపులో కలుస్తాయి. భ్రమవిచ్ఛిత్తి ఎక్కడ జరుగుతుంది? హాస్యస్ఫురణ ఎక్కడనుంచి మెరుస్తుంది? తోలుబొమ్మలాటల్లో, భాగవతుల కథాగానంలో సాధ్యమవుతుంది. సంభాషణాపటిమ–కాగల సంఘటనల సూచనలు సాగిస్తూ భావబంధురంగా ఎలా సాగించవచ్చు? సంస్కృతనాటకాలలో, గ్రీకునాటకాలలో ఎన్నో పాఠాలు ఉన్నాయి. 'సంపూర్ణ' నాటకంగా పాట, ఆట, మైమ్ ఆంగికభాష ప్రయోగిస్తూ కాయితంపులి(శంకర్‌గణేష్ హిందీమూలం) అందుకే ప్రదర్శించారు.

శర్మగారు చేసిన అనువాదాలలో, ప్రదర్శనలలో అగ్రభాగాన నిలిచేది– రాజా ఈడిపస్. క్రీస్తుపూర్వం 496 నుండి 406 వరకు జీవించిన సోఫోక్లిస్ రాసిన ఈ గ్రీకునాటకం ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటకవిభాగ విద్యార్థులచే శర్మగారు ప్రదర్శింపచేయటం ఆయన అపార అంకితభావానికి సూచిక. ఇందులో ఆయన ప్రకటించిన గ్రీకు నాటక రచనా, ప్రదర్శనా విశేషాలు–వివరణలు చదివితే మరొక తెలుగురచయిత నాటకం రాయడానికి సాహసించడు. పాత్రలవెనుక, ప్రదర్శనరీత్యా ఇంతనేపథ్యం ఉంటుందా అని ఏ రచయితా రచనకు పూనుకొనడు.

అంతటి జాగృతితో విద్యార్థులు శర్మగారి శిష్యరికంనుండి పాఠాలు నేర్చుకొన్న అదృష్టవంతులు. ఐ.ఐ.టి.లలో ఇంజినీరింగ్ విద్యార్థులు తయారయినట్టు, శర్మగారు నాటకవిభాగ విద్యార్థులను తీర్చిదిద్దారు. అంతటి చదువునేర్పిన దేశికులువారు. అనువాదంలో ప్రాంతీయస్పృజన అర్థంలో, శైలి అర్థంలోనూ దేశిత్వం ఆయనది.

ఆయన 20వ ఏటనే ఆకాశవాణి కళాశాల విద్యార్థులకు నడిపే రేడియోనాటకరచనలో తొలిసారి 'కల–కాపురం' శ్రవ్యనాటికకు (1954–55లో) బహుమతి పొందారు అని ఇంత రాసినతర్వాత చెప్పటం సరికాదు. 1974లోనే ఆయన స్వతంత్రంగా నాటకాలు రాయడం మానుకున్నారు. ప్రతిభకి వయసేమిటి? 30 నాటకాలలో నటించి, 60 నాటకాలకు దర్శకత్వం వహించిన తర్వాత, అయినా ఆయన రచనాశక్తి రెండుపదులు దాటీదాటని విద్యార్థిదశలోని శక్తి ఇది :

**కమల :** ....... జీవితాన్ని గురించి ఎన్ని కలలు కన్నాను. తీరా ఎక్కడం, వెంటనే పడటం తెలుసుకున్న తర్వాతగాని, నేను ఎక్కింది ములగచెట్టని తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు మళ్ళీ చెట్టు ఎక్కడం నేర్చుకోవాలంటే మాటలా?

శర్మగారిలా పరిషత్తు ప్రదర్శన నాటకాలకు ఇలా సంభాషణలు రాసే రచయిత ఎక్కువ రచనలు చేయకపోవటం ఒకరకంగా నష్టమేకాని, అలా ఆయన రచయితగానే ఉండిపోతే వందలాది వ్యాసాలు రాస్తూ 'దక్షిణభారత రంగస్థలి సాంప్రదాయాలు' అంటూ జాతీయ నాటకసంస్థకు ఉపన్యాసం (1990) చేయగల

పరిశోధకుడు దక్కేవాడు కాదు. పురాణం సూరిశాస్త్రిగారి నాట్యాంబుజ విశేషాలమీద, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి ఏకాంకికలమీద, కన్యాశుల్కం వంద సంవత్సరాల సమీక్షలమీద వందలకొద్దీ నాటకవ్యాసాలు వచ్చివుండేవికావు. ధర్మవరంవారి నాటకాలు మళ్ళీ వెలుగుచూసి ఉండేవికావు.

శర్మగారితో యథాలాపంకబుర్లు చెప్పినా, గంభీరంగా కూర్చుని మాట్లాడినా, నేలమీద నడిచే ఒక ఉత్తమ పరిశోధకుడు గొంతు విప్పుతూనే ఉంటాడు. 'బారిష్టర్ పార్వతీశానికి ముందే ఒక నవల ప్రచురించారు. చింతామణిలో అచ్చయిందేమో!' అంటారు. 'పానుగంటికంటె ముందు అలాటి గొంతుతోనే బుద్ధిరాజు ఈశ్వరప్పపంతులుగారు 1908లోనే పర్లాకిమిడి నుంచి హాస్యం రాసేవారండీ!' అని గొప్పగా ప్రస్తావించాను. 'అవును. ఆయన అప్పట్లోనే సినీమా స్లైడుల్లా బొమ్మలు చూపిస్తూ తిరుగుతూ ఉండేవాడు. మంచి వ్యంగ్య ప్రక్రియ రాసేవాడు' అంటారు.

గంభీరంగా ప్రశ్నిస్తే అలవోకగా రత్నాలవంటి సమాధానాలిస్తారు. శర్మగారి మాటల్లోనే :

"కథని స్టయిలైజ్డుగా (శిల్పంతో ప్రదర్శించాలంటే) చూపాలంటే సంస్కృత నాటకాలకు వెళ్ళాల్సినదే."

"ఆంగ్లనాటకాల నుండి మనం నేర్చుకొనవలసిన వాటికంటే నేర్చుకోకూడనివి వున్నాయి"

"మనవాటి ఇతర సంగీతపు వరసలని పద్యనాటకాలలో అనుసరించారు. హరిప్రసాదరావు, యడవిల్లి కొంచెం అడాప్టు చేసుకొన్నారు. మనం సంగీతాన్ని నాటకానికి అనుసంధానం చేసుకోలేకపోయాం. సంగీతంలో అంతర్గతంగా వుండే జీవనాడిని పట్టుకోలేకపోయాం!

"పెద్ద ఆఫీసరుగా పనిచేసిన బుర్రా సుబ్రహ్మణ్యంగారు 'నన్నిలా బ్రతకనీయండి' అని స్త్రీల పక్షాన ఒక నాటకం రాసారు. ప్రచురించారు. కాని బైటకు రాలేదు.

'ఇచ్చెను రాసన', 'ఎనిమీ ఆఫ్ ది పీపుల్' ని అనుసరించి రాయవలసినదే. నిజంగా అనుసరించి రాయలేదు.'

'మృచ్ఛకటికం ఇంగ్లీషులో వేశాం. ఎక్బోటే మైత్రేయి వేషంవేశాడు. ఇంగ్లీషు నాటకాలని ఇక్కడ చూసేవారు తక్కువ.'

'మన పద్యనాటకాన్ని తిరిగి బ్రతికిద్దామని ప్రయత్నం చేసినా విఫలమయింది. భాష తెలిసిన హార్మనిస్టు లేడు.'

'పరిమిత వనరులతో ఔత్సాహిక నాటకరంగం కృషివలన సాంఘికనాటకం మినుకుమినుకుమని నడుస్తోంది.'

'నాటకాల్ని సాహిత్యానికి దూరం చేసారు. ఎప్పుడు నాటకం, సాహిత్యంలో భాగంగా వస్తుందో, అప్పుడే నిలబడుతుంది.'


'అబ్బూరి రామకృష్ణారావుగారు కన్యాశుల్కం, మృచ్ఛకటికం చేసారు. మేము హైద్రాబాదులో ప్రయోగాత్మకంగా చేసాం. జానపదకళారూపాలు పెట్టాం. ఎక్స్‌ప్రెషనిస్టిక్ నాటకం తెచ్చాం. బ్రెక్ట్ – మైమ్ తేవడానికి భయపడ్డాం. బ్రెక్టదే – చాక్‌సర్కిల్ సగం నాటిక 3 1/2 గంటలు ప్రదర్శించాం. మూడులక్షలు ఖర్చుచేసాం. కె.వి. గోపాలస్వామి మంచి నాటకాలే వేయించారు. నాలుగుచోట్ల తిప్పలేకపోయారు. మన విద్యార్థులకు ఇతర ప్రాంతపు నాటకాలు చూసే అవకాశం లేదు'.

'ఆధునిక వృత్తి రంగస్థల దృష్టి మనకు లేదు. కన్నడం నుంచి నేర్చుకోలేదు. ప్రయివేటు సంస్థలు మలయాళం వాళ్ళకి సహాయపడ్డారు. కలకత్తాలో వామపక్ష ప్రభుత్వం ఉన్నకాలంలో, రంగస్థలం వారిని అనుసరించింది. కాని మనవారు మధ్యతరగతి ప్రజలు. ఆంధ్రసమాజం సాంప్రదాయక అభిరుచులు కలది. మా భూమి నాటకం తెలంగాణాకు నప్పే కథ. ఇక్కడ మనకు – కూలిరాజు, పాలేరు నాటకాలతో ఒక మలుపు రావలసింది. రాలేదు. దర్శకుడు, నటులు – మనకి అందరూ మధ్యతరగతివారే.'

'నాటకం సమస్య మీద ఆధారపడి సాగుతుంది. సమస్యని అధ్యయనం చేయాలి. అలా చేయకుండా రాస్తున్నారు నాటకం. ఆలోచనలను స్వాగతించే మనస్తత్వం కాదు మనది.'

'చూసి ఆనందించే సంస్కారం ఉన్నవారూ, రచయితలూ, దర్శకులూ కలిసి ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతాలలోనూ శ్రీకాకుళం, మధ్యకోస్తా, రాయలసీమ, మూడు రిపర్టరీ – నటబృందాలను జీతాలకు ఏర్పరచుకోండి. 25 లక్షల రూపాయలు పద్యనాటక బృందానికి, 25 లక్షల రూపాయలు సాంఘిక నాటకానికి ఖర్చుపెట్టి నటులను తయారుచేయండి. ముందే నాటకం ఇవ్వకండి. 3 కోట్ల రూపాయలతో మూడు బృందాలు తయారవుతాయి.

అదీ నాటక సమరం తెలిసిన సేనాధిపతిగారి అంతరంగం. నాగభూషణశర్మగారు అలా అరవైఏడు సంవత్సరాలుగా ఆయుధాలు పదునుపెడ్తూనే ఉన్నారు.



నేషనల్ ఫోక్‌లోర్ ఫెస్టివల్, హైదరాబాద్. వేదికపై ఆచార్య బిరుదురాజు రామరాజు